జలకళ సంతరించుకున్న పింఛా ప్రాజెక్టు

పింఛా జలాశయానికి జలకళ

0.320 పూర్తి స్థాయిలో నిల్వ
3,770 ఎకరాలకు నీటి లభ్యత
నేడు గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పింఛా జలాశయం పూర్తిస్థాయి జలకళను సంతరించుకుంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ధాటికి పింఛా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు 0.327 ఎంసిఎఫ్‌టి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా 0.320 ఎంసిఎఫ్‌టి నిల్వకు చేరుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులోభాగంగా రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు సి.జగన్‌మోహన్‌రాజు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ సమక్షంలో గేట్ల ఎత్తివేతకు సిద్ధమైంది. పింఛా జలాశయం పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకోవడంతో సుండుపల్లి మండల పరిధిలో 3,770 ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుంది. దీనికితోడు మరో ఎనిమిది చెరువులకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి రానుంది. 2020 నవంబర్ 19న సంభవించిన జవాద్ తుఫాన్ ధాటికి పింఛా రిజర్వాయర్ మట్టికట్టలు తెగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం జిల్లా నీటిపారుదలశాఖ రూ.62 కోట్లతో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులకు ప్రతిపానదనలు పంపించింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదలనలకు ఆమోదం తెలిపింది. ఈమేరకు అన్నమయ్య జిల్లా నీటి పారుదలశాఖ మట్టికట్టల పునరుద్ధరణ పనులను చేపట్టింది. మూడేళ్ల వ్యవధిలో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసింది. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో 2024లో ఫెంగల్ తుపాన్ ధాటికి పింఛా జలాశయం నిండిన సంగతి తెలిసిందే. తాజాగా రెండవ ఏడాది ఉపరితల ఆవర్తనం ధాటికి పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంది. ఈనేపథ్యంలో అన్నమయ్య జిల్లా ఇంజినీరింగ్ యంత్రాంగం గేట్ల ఎత్తివేసి దిగువ భాగానికి నీటిని విడుదల చేయనున్నారు. దీంతో బాహుదా నది జల పరవళ్లతో తెగిన అన్నమయ్య రిజర్వాయర్ మీదుగా సోమశిల వెనుకజలాల్లో కలవనుంది.

మూగవేదన

పశుపోషణ భారమై కబేళాలకు తరలింపు
- రాష్ట్రాలు దాటి వెళ్తున్న పశుసంపద

కొనుగోలు చేసిన పశువులకు గుర్తులు వేస్తున్న వ్యాపారి

ప్రజాశక్తి - చాపాడు

రోజు రోజుకూ పశువుల పోషణ భారమై పాడి రైతులు పశువులను సంతకు (కబేళాలకు) తరలిస్తున్నారు. పాడి ఉన్న ఇంట్లో సిరి సంపదలకు కొదవ ఉండేది కాదని ఒకప్పటి మాట. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో పాడి పోషణ రైతులకు భారంగా మారింది. శనివారం వచ్చిందంటే చాలు సంతలో పశువులను కబేళాలకు తరలిస్తున్న ఘటనలు కోకొల్ల లుగా దర్శనమిస్తాయి. మార్కెట్ యార్డు పరిధిలో నిర్వహించే సంతను పరిశీలిస్తే పది శాతం మాత్రమే రైతులు పశువులను పోషణ కోసం కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన 90 శాతం కబేలాలకు తరలించే దళారులు పశువులను కొనుగోలు చేస్తున్నారు. భారీ వాహనాల్లో కొనుగోలు చేసిన ఎనుములు, ఎద్దులను వందలాదిగా కుక్కి రాష్ట్రాలను దాటిస్తున్నారు. పశువుల తరలింపులో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు.

ఆటోలో నిబంధనలకు విరుద్ధంగా పశువులను ఎక్కువ సంఖ్యలో ఎక్కిస్తున్న వ్యాపారులు

నియోజవర్గ పరిధిలోని చాపాడు, బి.మఠం, దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరులో వేలాది మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. పాడి పరిశ్రమలో ఆదాయం తగడ్డంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లోని రైతులు పాడి పరిశ్రమకు స్వస్తి పలుకుతుండడంతో పాల కొరత ఏర్పడుతోంది. ఆహార పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు పాడిపరిశ్రమ వైపు మొగ్గుచూపు తున్న తరుణంలో పాడి పరిశ్రమ కూడా సంక్షోభంలో కూరుకుపోతుండంతో రైతు లు దిగాలు చెందుతున్నారు. గత ఏడాది సకాలంలో వర్షాలు పడక కరువు పరిస్థితులు నెలకొనడంతో దిగుబడి చేతికందక రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. దీంతో వేసవిలో పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది.పశుగ్రాసం, దాణా తదితర ఖర్చులురెట్టింపు పెరగడంతో పాడి పెంపకంపై రైతుల్లోఆసక్తి సన్నగిల్లు తోంది. నాడు పాలు అమ్మిన రైతులే నేడు పాలకేంద్రాల వైపు పాలకోసం పరుగులు తీసే పరిస్థితి నెలకొంది.

భారమైన పశుపోషణ..

గతంలో గేదెలను మేతకు పొలానికి తోలుకెళ్లే పశువుల కాపర్లు అందుబాటులో ఉండేవారు. ఉదయం పశువులను తోలుకొని వెళ్లి సాయంత్రం వరకు మేపుకొని వచ్చేవారు. దీంతో పోషణ భారం కాస్త తగ్గేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో దానా ఖర్చులు అధికమవుతున్నాయి. పసుపు పోషణతో కుటుంబాలను నెట్టుకు రావడం కష్టతరమవుతుంది. ఖర్చులు పెరగడం ఆదాయం తగ్గడం అందుకు ప్రధాన కారణం. పాడి పరిశ్రమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని తెలుస్తుంది. దీనికితోడు పశువుల ధరలు అమాంతంగా పెరిగాయి. ఎక్కడా పశువులకు మేత దొరకనిపరిస్థితి. గేదెలను మేపడం వీలుకాక చాలామంది పాడి రైతులు ఒకటి, రెండు గేదెలతో సరిపెట్టుకొంటున్నారు. మిగిలిన వాటిని అమ్మేసుకుంటున్నారు. పాడి ఆవులు, గేదెలకు అందించే గడ్డితోపాటు దాణా ధరలు పూర్తిగా పెరిగిపోయాయి.

గిట్టుబాటు కాని పాల ధర..

పాల ధర గిట్టుబాటు కాలేదు. డెయిరీల్లో 10 పాయింట్లు వెన్న శాతం చూపిస్తేనే లీటరు రూ. 75నుంచి రూ.78 వరకు ధర చెల్లిస్తున్నారు. వెన్నశాతం తక్కువగా ఉన్న పాలకు రూ.50 నుంచి 55 మించి రావడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ట్రాక్టర్ గడ్డి రూ.25 వేలకు చేరింది. బస్తాతౌడు ధర రూ.2వేలకు చేరింది. ఒక గేదెకు అయ్యే ఖర్చు పాల దిగుబడికంటే అధికమవుతోంది. దీంతో పాడి రైతులు నష్టాల పాలవుతున్నారు. చేసేది ఏమీలేక గేదెలు బక్కచిక్కిపోవడం తట్టుకోలేక కబేళాలకు తరలిస్తున్నారు.

పశు పోషణ భారమవుతోంది

గతంలో వ్యవసాయంతో పాటు పశుపోషణ సులభంగా ఉండేది. ప్రస్తుతం పెరిగిన ఖర్చులతో పోషణ భారం అవుతుంది. ప్రభుత్వం నుంచి పాడి పరిశ్రమకు సరైన ప్రోత్సాహం అందడం లేదు. వెన్న శాతం ద్వారా పాలను కొనుగోలు చేస్తుండడంతో ఏమాత్రం గిట్టుబాటుకోవడం లేదు. పశువులకు మేత దొరకడం కష్టమవుతుంది.

- సుబ్బయ్య, రైతు, వెంకటాపురం.

పశువులను అధికంగా అమ్మకాలు చేస్తున్నారు

ప్రతిశనివారమూ పశువులను కొనుగోలు చేసి కేరళ, తమిళనాడు రాష్ట్రాల వారికి ఎగుమతి చేస్తున్నాం. ప్రస్తుతం పశువుల ధరలు తక్కువగా ఉన్నాయి. రైతులు అధికంగా పశువులను అమ్మేందుకు సిద్ధపడుతున్నారు. ప్రతివారం ఒక లారీకి సరిపడే పశువులను కొనుగోలు చేసి తరలిస్తున్నాం. పశు పోషణ భారం కావడంతో రైతులు అమ్మకాలు చేపడుతున్నారు.

- అమోసు, పశువుల వ్యాపారి, మైదుకూరు.

ఉత్తమ వైద్య వైజ్ఞానిక సంస్థగా తీర్చిదిద్దుతాం

ఆలిండియా కోటా అడ్మిషన్లు ప్రారంభం
రూ.60 లక్షలతో లైబ్రరీ విస్తరణ
జిఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమున

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప ప్రభుత్వ వైద్య కళాశాల(జిఎంసి)ను ఉత్తమ వైద్య విజ్ఞాన సంస్థగా తీర్చిదిద్దుతాం. ఇటువంటి ఘనతర లక్ష్య సాధనకు ఫ్యాకల్టీ, సిబ్బంది, పరిస్థితుల సహకారం అవసరం. ఆదిశగా కసరత్తు చేపట్టాం. రాష్ట్రంలోని కర్నూలు, తిరుపతి, గుంటూరు, విశాఖ ప్రభుత్వ వైద్య కళాశాలలకు ధీటుగా నిలుపడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం. ఇందులోభాగంగానే ఎమర్జెన్సీ మెడిసిన్ వంటి ఆధునిక కోర్సులు సహా ఇతర ఆధునిక కోర్సుల నిర్వహణలతో ముందుకు సాగుతున్నాం. దేశంలోనే ప్రతిష్టాత్మక ఐసిఎంఆర్ వంటి ప్రాజెక్టుల పరిశోధనలకు విద్యార్థుల ఎంపిక, నిజాం ప్రతిష్టాత్మక వైద్య సంస్థల్లో పీజీ అడ్మిషన్లు లభించడం, జిజిహెచ్‌లో జరుగుతున్న అరుదైన ఆపరేషన్లలో సీనియర్ ఫ్యాకల్టీలు పాలుపంచుకోవడం జరుగుతోంది. వైద్య కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నాం. డిజిటల్ లైబ్రరీ విస్తరణ, స్పోర్ట్స్‌కు ప్రోత్సాహంతో శారీరక, మానసిక సమతుల్యత సాధించడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. మూడేళ్ల కిందట నుంచి పీజీ సీట్ల సంఖ్య క్రమేణా పెరుగుదల కనిపిస్తోంది. ఫలితంగా జిజిహెచ్ వైద్య సేవల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. జిఎంసి కళాశాల ఏర్పాటు నుంచి అంచెలంచెలుగా 33 నుంచి 127 వరకు పీజీ సీట్లను పెంచుకోవడం, ఎమర్జెన్సీ మెడిసిన్ వంటి ఆధునిక కోర్సులతో ముందుకెళ్తు న్నామని పేర్కొంటున్న జిఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమునతో ముఖా ముఖి...

ముఖా ముఖి..

ఆలిండియా కోటా సీట్ల వివరాలు తెలపండి?

జిఎంసిలో రాష్ట్ర కోటా కింద 149, ఆలిండియా కోటా కింద 26 ఎంబిబిఎస్ సీట్లను భర్తీ చేయాల్సి ఉంది. ఇందులోభాగంగా ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు సీట్ల భర్తీ ప్రక్రియను చేపట్టాలి. ఈమేరకు అడ్మిషన్ల ఏర్పాట్లపై దృష్టి సారించాం. ఆలిండియా కోటా సీట్ల భర్తీ సమ యంలోనే జిఎంసిలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలను కూడా నిర్వహిస్తున్నాం.

జిఎంసి ప్రాధాన్యతలను వివరించండి?

జిఎంసి కళాశాలను ఉన్నత ప్రమాణాలకు నిలయంగా మార్చడమే లక్ష్యం. ఐసిఎంఆర్ ప్రాజెక్టులు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో అడ్మిషన్లు, అరుదైన ఆపరేషన్లను సక్సెస్ చేయడం వంటి కార్యకలాపాలతో గుర్తింపు తీసుకురావడానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. జిఎంసి సిబ్బంది సహాయ సహ కారాలు అవసరం. ఈదిశగా ముందుకు సాగుతున్నాం. ఫలితంగా రాష్ట్రం లోని కర్నూలు, తిరుపతి, గుంటూరు, విశాఖ వంటి ప్రముఖ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రమాణాలను అందుకునే ప్రయత్నాలు చేస్తున్నాం.

జిఎంసి పురోగతి గురించి తెలపండి?

జిఎంసి పీజీ సీట్ల లభ్యత, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, నాణ్యమైన బోధన, లైబ్రరీ సదుపాయం, రీసెర్చ్‌ను ప్రోత్సహించడం, డిస్టింక్షన్స్‌తో ఉత్తీర్ణత సాధించడం జరుగుతోంది. ఇటువంటి కృషి కారణంగా ఉత్తర, దక్షిణ భారతదేశంలోని హర్యానా, రాజస్థాన్, కేరళ, తమిళనాడు, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ వంటి రాష్ట్రాల నుంచి విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకుంటున్నారు.

మెడికల్ సీట్ల వివరాలు తెలపండి?

2023-24 అకడమిక్ ఇయర్‌లో 175 ఎంబిబిఎస్, 113 పీజీ సీట్లు ఉన్నాయి. ఇడబ్ల్యుఎస్ కోటాను అమలు చేసిన నేపథ్యం, కొన్నేళ్ల నిరంతర శ్రమ కారణంగా 33 పీజీ సీట్ల నుంచి 113 పీజీ సీట్లకు చేరు కోవడం ఆనందంగా ఉంది. 2025-26 అకడమిక్ ఇయర్‌లో 175 యు జి, 127 పీజీ సీట్లతో సీట్ల సంఖ్య పెరిగింది.

ఫ్యాకల్టీ లభ్యతపై మాట్లాడండి?

జిఎంసితోపాటు సూపర్‌స్పెషాలటీలో కోర్సులను కలుపుకుని 34 డిపార్టుమెంట్లున్నాయి. వీటిలో ప్రీక్లినికల్, అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, పారాక్లినికల్, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ, పాథాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, ఇఎంటి, ఆప్తాల్మజీ, సర్జరీ, మెడిసిన్ ఓబిజి, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, డెర్మటాలజీ, ఫల్మనరీ మెడిసిన్, రేడియోలజీ, సైక్రియాట్రీ, రేడియో ఆంకాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్ వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. వీటికి అనుభజ్ఞులైన ఫ్యా కల్టీ అందుబాటులో ఉంది.

జిఎంసి విస్తరణ ప్రతిపాదనలేమిటి?

జిఎంసి విస్తరణ ఆలోచనలున్నాయి. ఇందులో రూ.60 లక్షలతో డిజిటల్ లైబ్రరీ విస్తరణ, 25 కంప్యూటర్స్ ఏర్పాటు, 450 మందికి సరి పడా ఎగ్జామినేషన్ హాల్ ఉన్నాయి. వీటితోపాటు జి ఫ్లస్‌త్రీ 63 గదుల చొప్పున రెసిడెన్షియల్ హాస్టల్ ఫ్లోర్‌కు 21 గదుల చొప్పున ఏర్పాటు చేసే ఆలోచన ఉంది.

పారా మెడికల్ విద్యార్థుల ఉత్తీర్ణత ఎలా ఉంది?

10 మంది బిఎస్‌సి అనస్థీషియా టెక్నీషియన్స్ విద్యార్థులున్నారు. వీరిలో నాలుగు డిస్టింక్షన్స్‌తోపాటు పలువురు మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించడం జరిగింది.

జిఎంసి సిబ్బంది వివరాలు తెలపండి?

జిఎంసిలో 477 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో 277 మంది బోధన, 200 మంది బోధనేతర సిబ్బంది ఉన్నారు. బోధన సిబ్బందిలో 18 మంది ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్ 60 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 114 మంది ఉన్నారు. వీరికి అదనంగా బోధనేతర సిబ్బంది 200 మంది వరకు ఉన్నారు.

విష జ్వరంతో విద్యార్థి మృతి

- పారిశుధ్య లోపమే కారణమంటున్న ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

బింగి రఘువరన్ (ఫైల్)

స్థానిక శ్రీరాంనగర్‌వీధిలో ప్రభుత్వ పాఠాశాలలో 4వ తరగతి చదివే బింగి రఘువరన్ (9) అనే విద్యార్థి ఆదివారం తెల్లవారుజామున విష జర్వంతో మృతి చెందాడు. కళాశాల రోడ్డులోని శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్న బింగి ఓబులేసు, భారతికి ఇద్దరు పిల్లలు ఉండగా పెద్ద కుమారుడైన రఘు వరన్ శ్రీరాంనగర్ లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. అతని ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో పందుల కూడ కలియ తిరుగుతున్నాయి. పైగా దానికి తోడు దోమలు కూడా విపరీతంగా పెరిగి పోవడంతో మూడు రోజుల కిందట విద్యార్థికి జర్వం వచ్చింది. తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రిల్లో చూపించారు. రఘువరన్‌కు జర్వం తగ్గక పోవడంతో కడప రిమ్స్ కు తరలించి చికిత్స చేశారు. మెదడుకు జర్వం సోకికిందని వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని సిమ్స్, రూయాకు తీసుకెళ్లారు. అక్కడ బెడ్లు లేక పోవడంతో తిరిగి కడప రిమ్స్‌కు తీసుకొని వచ్చి చికిత్స చేయించారు. పరిస్థితి మిషమించి విద్యార్థి విష జర్వంతో మృతిచెందాడు. విద్యార్థి మృతి చెందడంతో అ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. పాఠశాల ఉపాధ్యాయులు కూడ విద్యార్థి భౌతికాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బెర్దారి పనులు చేసుకొని పిల్లలను చదివించు కొంటున్న సమయంలో విషజర్వంతో తన బిడ్డ మృతి చెందాడని విద్యార్థి తండ్రి ఓబులేసు వాపోయాడు.

లోపించిన పారిశుధ్యం..

వేంపల్లెలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తుంది. వీధుల్లో చెత్త దిబ్బలు పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి పోవడం వలనే వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను అధికారులు తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని అంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ కూడా సరిగా లేక పోవడం వల్ల వర్షపు నీరు కూడ ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉండడంతో ప్రజల ప్రాణాలకు నష్టం కలుగుతున్నదని అంటున్నారు. కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రక్త పరీక్షలను చేయాలని కోరుతున్నారు.

శ్రీరాంనగర్‌లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

బుగ్గవంక కాల్వపై బ్రిడ్జిలు నిర్మించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

బుగ్గ వంక కాల్వపై షామీరియా, లా కళాశాల వద్ద బ్రిడ్జిలు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. షామీరియ మసీదు బుగ్గ వంక రక్షణ గోడ వద్ద భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జాకీర్ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐసిసి కో- ఆర్డినేటర్ ఎస్. ఎ. సత్తార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాసిర్ హుస్సేన్, అన్వర్, ఆసిఫ్ ఖాన్, కోటపాటి లక్ష్మయ్య మాట్లాడుతూ 2001వ సంవత్సరంలో వచ్చిన బుగ్గ .వంక వరదల కారణంగా కడప నగరంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బుగ్గ వంక పైన ఆరు శాశ్వత బ్రిడ్జిలు నిర్మించింది అని తెలిపారు. బుగ్గ వంక రక్షణ గోడ మంజూరు చేసింది. షామీరియా మసీదు వద్ద, లా కళాశాల వద్ద హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాలని తరువాత వచ్చి ప్రభుత్వాలకు విన్నపాలు చేసినా నిర్మించలేదు అన్నారు. ఎన్నికల సందర్భంలోనూ ఎన్నికల తర్వాత కూడా ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసుల రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బుగ్గ వంక పైన సదరు బ్రిడ్జిలు నిర్మిస్తామని, ప్రభుత్వం ఈ విషయంలో సహకరించకపోతే సొంత నిధులతో అయినా బుగ్గ వంకపై సదరు బ్రిడ్జిలు నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా బుగ్గ వంకపై బ్రిడ్జిలు నిర్మించలేదు అన్నారు. రెండు చోట్ల కూడా హై లెవెల్ బ్రిడ్జిలు సౌకర్యవంతంగా నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బ్రిడ్జిలు నిర్మించకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి,అక్రమ్, జాకీర్ ఖాన్, జహూర్, అలీ జబ్బర్ ,రహమతుల్లా ఖాన్ ,కమల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపల్లెకు రోడ్డు ఏర్పాటు చేయాలని
డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి - బద్వేలు

మట్టి రోడ్డుపై నాట్లు వేస్తున్న గ్రామస్తులు

బద్వేలు మండలం, తిమ్మరాజుపల్లె గ్రామానికి రోడ్డు వేయాలని గ్రామస్తులతో కలిసి డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బురద రోడ్డులో మహిళలతో కలిసి వరి నాట్లు వేసి వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, గ్రామస్తులు రామరాజు సంయుక్తంగా మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గం, బద్వేలు మండలం, అనంతరాజపురం పంచాయతీ పరిధిలోని తిమ్మరాజు పల్లె గ్రామనికి సరైన రహదారి లేక చిన్నపాటి వర్షానికే రహదారి మొత్తం బురదమయం కావడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గ్రామంల దాదాపు 150 కుటుంబాల వారు సుమారు 400 పైబడి జనాభా నిత్యం ఈ రహదారి గుండా బద్వేలు పట్టణానికి వివిధ పనుల కోసం రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, గర్భిణులు ఈ దారిలో ప్రయాణం చేసే క్రమంలో ఎన్నోసార్లు కిందపడి గాయాలు పాలైన సంఘటనలున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వాలు పాలకులు మారుతున్నా సదరు గ్రామానికి సరైన రోడ్డు ఏర్పాటు చేయకపోవడం విచారకరమని, ఎన్నికల ప్రచారంలో మాత్రం రోడ్డు నిర్మిస్తామని వాగ్దానాలు చెపుతున్న నాయకులు ఎన్నికల తర్వాత మా ఊరి అభివృద్ధిని పట్టించుకోకపోవడం దారుణమని ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి తిమ్మరాజు పల్లె గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో రానున్న కాలంలో గ్రామస్తులతో కలిసి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష- కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్, ఉపాధ్యక్షులు పత్తూరు యువరాజు, హరిఫ్, గ్రామస్తులు గురు, శశి కుమార్, రవీంద్ర, రవి, వినయ్, వెంకటరమణ, జయరామయ్య మరియు మహిళలు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి బీరువా, పుస్తకాల బహూకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

తప్పెట్ల కొత్తపల్లికి చెందిన మల్లిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పెన్నా సిమెంట్స్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ మల్లిరెడ్డి సుబ్బారెడ్డి ఆదివారం బీరువాను, వంద పుస్తకాలనుసహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు, ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ వారు బహూకరించిన విలువైన గ్రంథాల్లో విష్ణు పురాణం, వామన పురాణం, శ్రీమద్భాగవతం (వ్యాసుడు), ఆంధ్ర మహాభారతం, పోతన భాగవతం, శివరాత్రి మాహాత్మ్యం, శ్రీమద్భగవద్గీత, ఆంధ్రవాల్మీకి రామాయణం, కాళికాంబా సప్తశతి, కాళీమకుట కందములు, శ్రీమదాంధ్రాభ్యుదయం, ఉషశ్రీ రామాయణం, గీతామకరందం, శ్రీశైల చరిత్ర లాంటివి ఉన్నాయన్నారు.

కార్యవర్గం సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న పాస్టర్ మోహన్‌బాబు

నగరంలోని అతి పురాతమైన చర్చిగా పేరొందిన కాంగ్రి గ్రేషనల్ చర్చి కమిటీ కార్యవర్గం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని క్రైస్తవ ప్రముఖులు పాస్టర్ మోహన్ బాబు తెలిపారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రిగేషనల్ చర్చి 200 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంతోపాటు నూతన భవన ప్రారంభాన్ని పురస్కరించుకుని క్రైస్తవ గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో అతి పురాతన చర్చిగా కాంగ్రి గేషనల్ చర్చికి విశేష గుర్తింపు ఉందన్నారు. విశ్వాసుల ప్రార్థనలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు చర్చిని అన్ని విధాల అభివృద్ధి చెందేలా కృషిచేస్తున్న చర్చికమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైర్మన్ యు. సంజీవ రాయుడు, సెక్రెటరీ విజయుడు, ట్రెజరర్ సిహెచ్ నోవా బెన్నీ, డికాన్ రాజ మనోహర్ బాబు, డికాన్ కే టి బి. ప్రసన్నకుమార్, ఆశీర్వాదం, సుశీలమ్మ జయ కుమార్, మోహన్ చర్చి కమిటీ ప్రతినిధులు, క్రైస్తవ పెద్దలు, పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

రోధిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

సౌదీలో కుమారకాల్వ వాసి మృత్యువాత

రోధిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు
స్వగ్రామంలో విషాదఛాయలు

ప్రజాశక్తి-చక్రాయపేట

నూర్‌బాషా (ఫైల్)

కుటుంబాన్ని పోషణ కోసం దేశం కాని దేశానికి బతుకు దెరువు కోసం వెళ్లి మృతి చెందారు.చక్రాయపేట మండలం కుమార కాల్వ గ్రామానికి చెందిన వ్యక్తి. వివరాలు.. మండలంలోని కుమార కాల్వ గ్రామానికి చెందిన షేక్ నూర్ బాషా (38) బతుకు దెరువు కోసం 15 ఏళ్ల కిందట గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియాకు వెళ్లారు.అప్పుడుప్పుడూ స్వదేశానికి వచ్చి వెళ్తూ ఉండేవారు. సౌదీ అరేబియాలోని దమామ్ లోని ఒక కంపెనీలో కార్మికుడిగా నూర్ బాష పని చేసేవారు. సెలవుపై ఇండియాకు వచ్చి దాదాపు 5 నెలల కిందట మళ్లీ సౌదీకి వెళ్లారు. ఆదివారం 9 గంటలకు (ఇండియా కాలమానం ప్రకారం 12.30) నూర్‌బాషా డ్యూటీ కోసం సిద్ధం అయ్యేందుకు తన గదిలో ఉన్న బాత్రూంలోకి కలాకృత్యలు తీర్చుకొనేందుకు వెళ్లి ప్రమాద వశాత్తు కింద పడి పోయి మృతి చెందినట్లు అక్కడ ఉన్న తన తోటి స్నేహితులు ఫోన్ ద్వారా తెలిపినట్లు బంధువులు తెలిపారు. నూర్‌బాషా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గల్ఫ్ దేశానికి వెళ్లి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉపాధి కోసం గల్ఫ్ కు వెళ్లిన వ్యక్తి మృతి చెందడం బాధకరమని గ్రామస్తులు అంటున్నారు. కుటుంబ యాజమాని మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని బంధువులు వాపోయారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక పోవడం వల్ల సౌదీయాకు వెళ్ళినట్లు తెలిపారు. మృతునికి భార్య గౌసియాతో పాటు అర్షియా, రియాజ్ , రిజ్వాన్ అనే పిల్లలతో పాటు తల్లి ఉన్నారు. గల్ఫ్‌లో మృతి చెందిన నూర్ బాషాకుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అ మృతదేహన్ని స్వదేశానికి తొందరంగా తెప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు. గల్ఫ్‌లో నూర్ బాషా మృతి చెందిన విషయం తెలుసుకున్న కుమార్వ కాల్వ టిడిపి నాయకుడు మిఠాయిగిరి కరీముల్లా వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి తొందరగా తెప్పించేందుకు పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

విదేశీ ఎంబిబిఎస్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి- కడప అర్బన్ : నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో, వోక్స్ ఓవర్సీస్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో విదేశీ విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రీజినల్ కో- ఆర్డినేటర్ నాగమణి ఆదివారం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు విదేశీ ఎంబిబిఎస్ చదువు అవకాశాలు, వీసా ప్రాసెస్, స్కాలర్‌షిప్‌లు, యూనివర్సిటీ నిధులు వంటి అంశాలపై నిపుణులు సమగ్ర సమాచారం అందించారు. విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పించగా, కొంతమంది విద్యార్థులు వెంటనే తమ ప్రవేశాలను పూర్తి చేసుకున్నారు. ఇ డాక్టర్ రాకేష్ సింగ్ (యూనివర్సిటీ ప్రతినిధి), షరీఫ్ (వోక్స్ ఓవర్సీస్ ప్రతినిధి) ప్రత్యేక అతిథులుగా పాల్గొని విదేశీ విద్య, ముఖ్యంగా ఎంబిబిఎస్ చదువుపై తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య విద్య పొందే మార్గాలను వివరించడంతో పాటు, స్కాలర్‌షిప్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సిఆర్ఐ సుబ్బారెడ్డికి నివాళి

ప్రజాశక్తి - కడప సిటీ : ప్రముఖ రాష్ట్ర బిసి కే.శే. సిఆర్ఐ సుబ్బారెడ్డి పదవ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. కడప నగరంలోని వినాయక నగర్ సిఆర్ఐ ఘాట్‌లో ఆయన చిత్రపటానికి కుటుంబ సభ్యులు, బంధువులు, సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఆయన జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్ఐ సుబ్బారెడ్డి సతీమణి కొరముట్ల వెంకట లక్ష్మమ్మతో పాటు కుమారులు సిఆర్ఐ సునీల్ జయంత్, దినేష్ వారి కుటుంబ సభ్యులు, బిసి సంక్షేమ సంఘం కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు కల్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు, ఉపాధ్యక్షుడు చౌడం సూరిబాబు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

మురుగు పారక.. దుర్వాసన వీడక

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధుల కింద దళిత కాలనీలలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.కోట్ల ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడంలేదు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని పత్తూరు దళితవాడలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఏళ్ల నాటి క్రితం నిర్మించిన సిమెంట్ రహదారులు ప్రస్తుతం తగ్గుకు (లోతట్టు) చేరాయి. ఈ నేపథ్యంలో వర్షం వస్తే నీరంతా రోడ్డుపై నిలుస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీరు రోజుల తరబడి నిలువ చేరి ఉండడం వల్ల దోమల బెడద అధికంగా ఉందని, దుర్వాసన రావడంతోపాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నూతన సిమెంట్ రోడ్ల ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాని ఫలితంలేదని వాపోతున్నారు. కనీసం సంబంధిత అధికారులు దోమలు వృద్ధి చెందకుండా రసాయనాలను పిచికారి చేయించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ కోసం రైతులు ఎదురుచూపులు

ఎన్నికల కోడ్ పూర్తయినా రైతుల ఖాతాలో జమకాని వైనం

ప్రజాశక్తి - వేముల

అన్నదాత సుఖీభవ పథకం వేముల మండల వ్యాప్తంగా అమలు కాలేదు. దీనికి సంబంధించి నిధులు ఈనెల 2న అర్హులైన రైతుల ఖాతాల జమ అయ్యాయి. జిల్లాలో ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ ఉండడంతో మండల రైతులకు జమకాలేదు. అయితే ఎన్నికలు, కౌటింగ్ పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిఎం కిసాన్ డబ్బులు కూడా కొంతమందికే పరిమితమైందని.. ఇంకా చాలామంది మండల వ్యాప్తంగా జమ కాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసును సంప్రదించగా.. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల డబ్బులు జమ కాలేదని, ఎన్నికల కోడ్ పూర్తవడంతో మరో రెండు, మూడు రోజుల్లో రైతుల ఖాతాలో అన్నదాత సుఖీభవ నిధులు జమ అవుతాయని తెలిపారు. వేముల మండల వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు 6,281 మంది ఉన్నారని, ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుపుతానని ఆయన పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రేపు వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ సభా భవనంలో ఈనెల 19న ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కుళాయమ్మ తెలిపారు. ఎంపిపి లక్ష్మీగాయత్రి అధ్యక్షతన నిర్వహిస్తున్నామన్నారు. ఆయా శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, జాతీయ ఉపాధి, వెలుగు, వైద్యం, రోడ్డు భవనాల శాఖ, గృహ నిర్మాణ శాఖ తదితర వాటిపై సమీక్షిస్తామన్నారు. ఆయా శాఖల మండలస్థాయి అధికారులు నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ప్రజాప్రతినిధులు సమావేశంలో తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావాలని ఎంపిడిఒ సూచించారు.

కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ విష్ణు నారాయణ

ఆశ్రమం.. అంధుల జీవితాలకు వెలుగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శ్రీవీర నారాయణస్వామి ఆశ్రమం అంధుల జీవితాల్లో వెలుగు అని పట్టణ ఎస్ఐ విష్ణు నారాయణ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని శ్రీవీర నారాయణస్వామి అంధుల ఆశ్రమంలో ఆదివారం 10వ వార్షికోత్సవం సందర్భంగా లూయీ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అంధులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మానవుని సేవయే మాధవుని సేవ, అంధుల జీవితంలో చిరు దీపమే వెలుగించూ అని సందేశమిచ్చారు. ఆశ్రమ చైర్మన్ వెంకట మహేశ్వరి మాట్లాడుతూ ఆశ్రమం అభివృద్ధికి సాయం చేసిన దాతలు, పాత్రికేయులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, సేవ సంస్థలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్య క్రమంలో మల్లికార్జునరెడ్డి, మానవతా సంస్థ కన్వీనర్ డివి కొండారెడ్డి, ఆల్లం రంగనాయకులు, నరసింహ, ఆశ్రమం నిర్వహలు అనిమెల రామమోహన్, రామదేవి పాల్గొన్నారు.

ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒసిలకు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కలసపాడు

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ఒసి కుటుంబ సభ్యులకు ఇడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు 10 ఎకరాల లోపు భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబ సభ్యులకు మంజూరు చేయాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడికి సమాన హక్కు కల్పించాలని రాజ్యాంగం సూచించిందన్నారు. నిరుపేదలైన ఒసి సంఘంలోని చాలామంది రెడ్లు, బ్రాహ్మణులు, కమ్మ, బలిజ, ఆర్యవైశ్య, తదితర ఎన్నో కులాలు ఒసి జాబితాలో ఉన్నాయని, వారికి ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రెడ్డి సంఘం నాయకులు అమ్మిరెడ్డి వెంకట నాగిరెడ్డి, ఎర్రగుంట్ల నాగ మోహన్‌రెడ్డి, తుమ్మల కొండారెడ్డి, గువ్వల వెంకట సుబ్బారెడ్డి, పోలక సుబ్బారెడ్డి, రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ అయిన పోలీసులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మైదుకూరు పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్న ఐదుగురు పోలీసులకు ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఇటీవల బదిలీ అయిన ఎఎస్ఐ మురళి యాదవ్, పిసిలు రహీమ్, రెడ్డయ్య, సందీప్ రాజు, రమేష్‌కు మైదుకూరు సిఐ రమణారెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, సుబ్బారావు ప్రొద్దుటూరు రోడ్డులోని ఏఐ మినీ ఫంక్షన్ హాల్లో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ, ఎస్ఐలు చిరంజీవి, సుబ్బారావు మాట్లాడుతూ బదిలీ అయిన వారి సేవలను కొనియాడారు. అనంతరం వారిని సన్మానించారు.

బదిలీ అయిన పోలీసులకు సన్మానం చేసిన అధికారులు

మురికి కూపం.. ఆర్‌టిసి బస్టాండ్

చెరువును తలపిస్తున్న ప్రాంగణం-ప్రయాణికులకు ఇబ్బంది - ఆవులు, పందుల బెడద

బస్టాండ్ అవుట్ గేట్ దారిలో నిలిచిన వర్షపునీరు, బురద

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

రాయలసీమ కూడలి ప్రాంతమైన మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్ మురికి కూపంలా తయారైంది. ప్రయాణికులు బస్టాండ్‌కు రావాలన్నా, బస్సు దిగి అక్కడి నుంచి బయటకు వెళ్లాలన్నా నరకాన్ని చూస్తున్నారు. మైదుకూరు బస్టాండ్ అనంతపురం, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, చిత్తూరు పట్టణాలకే కాకుండా హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, చెన్నయ్ వంటి నగరాలక కూడా కూడలి ఉంటోంది. అలాంటి బస్టాండ్ చాలా అధ్వానంగా ఉంది. ప్రయాణికులు నడవడానికి కూడా వీల్లేదు. అడుగులు ఎర్రటి బురదలో వేయాల్సిందే. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు, మురుగు కాలువల నుండి వచ్చే నీరు నిల్వ అవుతోంది. బస్టాండ్ ప్రాంతం లో తట్టు కావడంతో పట్టణంలోని వర్షపునీరు, దాంతోపాటు మురుగు నీరు వచ్చి చేరుతోంది. ఇందుకుతోడు పందులు, ఆవుల సంచారం విపరీతంగా ఉంటోంది. ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఆటో, బైక్ నడిపేవారి పరిస్థితి ఆవులు, పందుల సంచారం వల్ల తీవ్ర అసౌకర్యంగా తయారైంది. నడిచే వెళ్లే ప్రయాణికులపై ఆవులు దాడి చేస్తున్న సంఘటనలు నిత్యం జరుగుతుంటాయి. పందుల సంచారంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే బురద, ఎండ పెడితే ఎర్రటి దుమ్ము ఇదీ మైదుకూరు ఆర్‌టిసి బస్టాండ్ పరిస్థితి. వర్షాకాలంలో ప్రయాణికులు సర్కస్ చేయాల్సిందే. బురద ఆరిపోతే దుమ్ముతో ముక్కు, నోరు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. బస్టాండ్ ఖాళీ స్థలాల్లో కార్గిల్ సేవలు, ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. ఇరుకుగా మారి బస్సులు, ప్రయాణికులు రాకపోకల సమయంలో అసౌకర్యం కలుగుతోంది. పాయింట్ వద్ద బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో పారిశుధ్య లోపంతో దుర్వాసన వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. సమస్యపై ఆర్‌టిసి అధికారులు, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి బస్టాండ్‌ను ఆధునీకరించి, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని పలు ప్రజా సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

బస్సు వస్తుండగా.. బురదలో ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

నాన్‌స్టాప్ సర్వీసుకూ 'స్త్రీ శక్తి'ని వర్తింపజేయాలి

మాట్లాడుతున్న వీరణాల శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం (ఉచిత బస్సు ప్రయాణం) నాన్‌స్టాప్ సర్వీసుల్లో కూడా వర్తింపజేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించడం హర్షణీయమన్నారు. కొన్ని సర్వీసులకే పరిమితం చేయడంతో విద్యార్థినులు, మహిళలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధానంగా జమ్మలమడుగు నుండి ప్రొద్దుటూరువ వెళ్లే నాన్‌స్టాప్ సర్వీసుకు స్త్రీ శక్తి పథకం వర్తించకపోవడంతో విద్యార్థినులు, కూలికి వెళ్లే మహిళలకు ఇబ్బందులు వస్తాయన్నారు. ప్రొద్దుటూరులో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఇంటర్మీడియట్ కాలేజీలు ఎక్కువగా ఉన్నాయని, జమ్మలమడుగు నుండి వందల సంఖలో విద్యార్థులు అక్కడికి వెళుతుంటారని పేర్కొన్నారు. మహిళా కూలీలు, జీవనోపాధికి వ్యాపారాలకు వెళ్లే మహిళలు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారన్నారు. ఉద్యోగస్తులు కూడా వెళుతున్నారన్నారు. ఆర్డినరీ సర్వీసులు తక్కువ ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బస్సు సర్వీసుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. నాన్‌స్టాప్ సర్వీసుల్లో కూడా ఈ పథకం వర్తింపజేయాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ పాల్గొన్నారు.

ఆ దారిలో వెళ్లాలంటే అవస్థలే..

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వేమగుంటపల్లి, పి.బొమ్మేపల్లి గ్రామాలకు వెళ్లాలంటే ద్విచక్ర, ఇతర వాహన దారులు, ప్రజలు నరకయాతన పడాల్సిందే.

ఇరుకైనా రోడ్డులో వర్షానికి నిలబడిన నీరు

జమ్మలమడుగు మండల పరిధిలోని బొమ్మేపల్లి గ్రామానికి కొత్త రోడ్డు మీదుగా వెళ్లడానికి ఉన్న రహదారిలో నాన్నెంపల్లె పుల్లయ్య, గంగమ్మ దేవాలయానికి మధ్యలో చిన్న ఇరుకైన దారి ఉంది. ఈ దారిలో ఓ వైపున వాహనం వస్తుంటే మరోవైపున ఆ వాహనం వెళ్లే వరకు మరో వాహనం ఆగి ఉండాల్సిందే. అంతేకాక ఈ ఇరుకైన దారిలో చిన్నపాటి వర్షం వచ్చినా, వేమగుంటపల్లె చెరువు నిండినా తిప్పలే. ఆ నీరు ఈ రోడ్డు మీద పడి తోటల్లో వెళ్లిపోవా ల్సివుంది. వర్షానికి పక్కనే ఉన్న పొలంలోని మట్టి కొట్టుకు రావడంతో ద్విచక్ర వాహనదారులు కింద పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. అంబవరం పంచాయతీకి చెందిన టిడిపి నేత పంజగాళ్ల రామయ్య ప్రజల బాధలు చూడలేక తాత్కాలికంగా ట్రాక్టర్‌తో గ్రావెల్ శుద్ధ తోలిస్తున్నారు. అటు పక్క ఉన్న తారు రోడ్డు ఎత్తులో సిమెంట్ రోడ్డు వేయాలని, నీరు పోయేందుకు పెద్ద సిమెంట్ పైపులు రోడ్డు కింద వేయడమా లేక చిన్నపాటి కల్వర్టు నిర్మించడమా చేయాలని పలువురు కోరుతున్నారు. ఇదే దారిలో పి.బొమ్మేపల్లికు వెళ్లాలంటే ఎత్తైన కొండ ఉంది. కొండపైనా 1975లో అప్పటి నాయకుడు మైకేల్ బాబు రోడ్డు వేయించారు. ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకోకపోవడంతో ఆటోలు, వాహనాలు లగేజీ తీసుకొని వెళ్లాలంటే మొరాయిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి కొండ ఎత్తు తగ్గించడమా లేక కింద నుంచి రోడ్డు ఎత్తు పెంచడమా చేయాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

ఎత్తుగా ఉన్న బొమ్మేపల్లి కొండ భాగం

ట్రాక్టర్‌తో గ్రావెల్ తోలిస్తున్న అంబవరం రామయ్య

విశ్వనాథపురంలో పురాతన టోలాస్, పిడిబాకు లభ్యం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటి పరిధిలోని విశ్వనాథపురం గ్రామంలో పురాతన కాలం నాటి 12 టోలాస్(ఇనుప తూనికరాయి), పిడిబాకు వెలుగులోకి వచ్చినట్లు చరిత్ర కారుడు బొమ్మి శెట్టి రమేష్ తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ టోలాస్ అనేది భారత దేశంలో బరువును కొలవడానికి ఉపయోగించే ఒక సంప్రదాయ యూనిట్‌గా పేర్కొన్నారు. పూర్వం వస్తువులను సరిగా తూకం వేసేందుకు ఈ రకమైన బరువును ఉపయోగించేవారని తెలిపారు. దీన్ని కాస్ట్ ఐరన్‌తో తయారు చేశారని తెలిపారు. దక్షిణాసియా (బ్రిటిష్ కాలం కంటే ముందు), భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాణిజ్యంలో ఒకప్పుడు చారిత్రక ప్రాముఖ్యతను కలిగిన ప్రామాణిక కొలమానంగా ఉండేదని వివరించారు. సాధారణంగా రెండు, నాలుగు, ఎనిమిది, పది, ఇరవై టోలాస్ దొరుకుతాయని, పన్నెండు టోలాస్ అరుదైందని తెలిపారు. ఇది చారిత్రక పురాతన వాణిజ్య పద్ధతులకు సంబంధించినదని తెలిపారు. పిడిబాకు అనేది చిన్న పదునైన కత్తి. పిడిబాకును కటారి అని కూడా అంటారన్నారు. పిడికిలితో పట్టుకొని ఉపయోగించే బాకు అని, సాధారణంగా దీన్ని రక్షణ కోసం, యుద్ధాలలోను, వేట కోసం వాడే ఆయుధమని వివరించారు. ఇది ఆయా కాల సాంకేతికతను, యుద్ధ పద్ధతులను ప్రతిబింబించేలా ఉందన్నారు. ఇది పదునైన అంచుతో, ఉపరితలం గరుకుగా, మధ్యలో వెడల్పుగా కర్రకు అమర్చడానికి ఒక సాకెట్ (గూడు) ఉందన్నారు. విశ్వనాథపురం గ్రామస్తుడు మూర్తి వెంకటేష్ తన పూరి గుడిసె శుభ్రం చేస్తుండగా ఈ వస్తువులు బయల్పడ్డాయని, ఆ వివరాలను తనకు చెప్పారని తెలిపారు. మైదుకూరు ప్రాంతంలో పురాతన చరిత్రకు సంబంధించిన గని ఉందని, మరింత పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వివరించారు.



టోలాస్, పిడి బాకు

శాస్త్రీయ పరిశోధనా రంగంలో ప్రభుత్వ కృషి పెరగాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

శాస్త్రీయ పరిశోధనా రంగంలో ప్రభుత్వ కృషి పెరగాలని, సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రయివేట్ పెట్టుబడులు ఆపాలని జెవివి జిల్లా కార్యదర్శి హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక పట్టణ మహాసభలు ఆదివారం సాయంత్రం జెవివి కార్యాలయంలోఉపాధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగకుండా ప్రభుత్వాలు పాఠ్యాంశాలను తొలగించడాన్ని తప్పు పట్టారు. సైన్స్ రంగంపై దాడి జరుగుతోందని, సైన్సుకు బడ్జెట్లో అతి తక్కువగా కేటాయింపులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర దేశాల్లో శాస్త్ర రంగానికి బిలియన్లలో కేటాయిస్తుంటే భారత్‌లో అతి తక్కువగా కేటాయింపులు జరిగాయన్నారు. సూడో సైన్సును ప్రభుత్వాలే ప్రోత్సహిస్తున్నాయన్నారు. ప్రయివేటీకరణ వల్ల ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. జెవివి వ్యవస్థాపక నాయకులు డాక్టర్ డి.నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జెవివి అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజల్లో శాస్త్రీయ ప్రచారాన్ని పెంచాలన్నారు. సూడో సైన్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆయన సూచించారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ పర్యావరణ వినాశనం కాకుండా ప్రజల్లో అవగాహన పెరగాలని పేర్కొన్నారు. నాణ్యమైన విద్య విద్యార్థులకు అవసరమని తెలిపారు. నిరుద్యోగం పెరుగుతుందని, దీన్ని తగ్గించే దిశగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న మూఢనమ్మకాలను తొలగించాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ హేతుబద్ధంగా ఆలోచించాలన్నారు. అప్పుడే దేశం ముందుకు పోతుందన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కోశాధికారి సుబ్బయ్య, నాయకులు సునీత, డాక్టర్ చక్రధర్, డాక్టర్ మురుకుటి సూర్యనారాయణరెడ్డి, నరేష్, రాజేష్, ఉషారాణి, వరలక్ష్మి, మధు, రవిశంకర్, వలి, మహిత, విశ్వనాథ్, దేవానంద్, ఖాజా , అల్లాబక్ష, రాజ్యలక్ష్మి, చంద్రశేఖర్, శివనాథ్, భారతి, సమరసారథి, ప్రకాష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెవివి జిల్లా కార్యదర్శి హేమంత్‌కుమార్

కేక్ కట్ చేస్తున్న పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

అనాథ వృద్ధులకు అన్నదానం సంతోషకరం

ప్రజాశక్తి - వేంపల్లె

వృద్ధాశ్రమంలో ఉన్న అనాథ వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్త రవికుమార్‌కు కవల పిల్లలైన కేతన్, కేతన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్థానిక గండి రోడ్డులో ఉన్న మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా తులసిరెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వృద్ధులకు అన్నదానం చేశారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవసేవ, ప్రార్థించే పెదవుల కన్నా.. సేవ చేసే చేతులు మిన్న అని మదర్‌థెరిస్సా చెప్పారన్నారు. అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులు విజయమోహన్‌రెడ్డి, ఆల్ఫాన్స్‌రెడ్డి, చిన్నప్పరెడ్డి ఆశ్రమం పెట్టి చాలా ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్‌రెడ్డి, హన్సికారెడ్డి, నాగరాజు, వినయ్, రవికుమార్, కేతన, కేతన్, విజయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ విగ్రహ ఊరేగింపు

జమ్మలమడుగు రూరల్ : ఆదివారం శ్రీకృష్ణ విగ్రహం ఊరేగింపుతో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందు జ్ఞాన వేదిక జమ్మలమడుగు కమిటీ శనివారం పట్టణంలోని ఎంపీ మునిరెడ్డి కాంప్లెక్స్ దగ్గర శ్రీకృష్ణ ప్రతి మను ఏర్పాటు చేశారు. ఆదివారం అక్కడి నుండి పాత బస్టాండ్, పూల మార్కెట్ మీదుగా, అమ్మవారిశాల వీధి, నారపుర దేవాలయం మీదుగా.. మళ్లీ మునిరెడ్డి కాంప్లెక్స్ వరకు గ్రామోత్సవం సాగింది. ముఖ్య అతిథులుగా చేనేత విభాగం రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, లాయర్ సూర్య పెద్దిరాజు హాజరయ్యారు. ఆయా సభ్యులు రంగనాయకులు, నరసింహ, నాగరాజు, శివ, సందీప్, చలపతి, వెంకటరెడ్డి, కునిషప్ప, లక్ష్మీదేవి, రాజేశ్వరి, రమణమ్మ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

డ్యామును పరిశీలిస్తున్న సయ్యద్ సలావుద్దీన్

బుగ్గవంక పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో బుగ్గవంక పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన బుగ్గ వంక డ్యామ్‌ను పరిశీలించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి ప్రవాహాన్ని ప్రస్తుతం డ్యామ్ లో ఎన్ని క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయని అక్కడి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి కడపలో కురుస్తున్న వర్షాల కారణంగా బుగ్గ వంక డ్యాం వల్ల గత అనుభవాలను, ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకొని ప్రమాదాలను అరికట్టాలని జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. కడపలో వర్షం పడితే బుగ్గ వంక పరివాహక ప్రాంత ప్రజలు ఆనాటి చీకటి రోజులు గుర్తుకు వస్తాయని తెలిపారు. గత సంఘటనలు దృష్టిలో పెట్టుకుని భయభ్రాంతులు అవుతున్నారని చెప్పారు. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

ఏషియన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ని పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నా సంకల్పంతో కడపలో అత్యాధునిక వైద్య పరికరాలతో ఏషియన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేశామని, సేవలు సద్వినియోగం చేసుకోవాలని ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణులు, పద్మభూ షణ్ అవార్డు గ్రహీత డాక్టర్ నాగేశ్వ రరెడ్డి కోరారు. ఆదివారం కడప నగరం శంకరాపురం మెయిన్ రోడ్డులో డాక్టర్ నాగేశ్వర రెడ్డి శిష్యుడు డాక్టర్ రితేష్ రెడ్డికి చెందిన ఏషియన్ గ్యాస్ట్రో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో గ్యాస్ట్రో ఆసుపత్రులు లేని కారణంగా ఇక్కడ అందుబాటులోనికి తేవడం అభినందనీయమన్నారు. నైపుణ్యంగల డాక్టర్ కడపలో వైద్య సేవలు అందించడం ప్రజలకు వరమని తెలిపారు. డాక్టర్ రితేష్ రెడ్డి మాట్లాడుతూ అతితక్కువ ఫీజులతో వైద్య పరీక్షలు చేసి, చికిత్స అందజేస్తామని చెప్పారు. ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు మాధవరెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు డాక్టర్ రితీష్ రెడ్డి, కోడలు డాక్టర్ శ్రావ్య రెడ్డి ప్రముఖ వైద్య నిపుణులు నాగేశ్వర్ రెడ్డి వద్ద వైద్య సేవ శిక్షణ పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. అధునాతనమైన పరికరాలతో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రారంభోత్సవానికి ప్రముఖ డాక్టర్లు, బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కడప అర్బన్ : కో – ఆపరేటివ్ కాలనీలో శ్రీ సాయిబాబా అనాధ శరణాలయంలోని విద్యార్థులకు మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు షేక్.అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ కె. నాగేంద్ర ప్రసాద్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ సేవలను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. శరణాలయం అధ్యక్షులు ఎస్వి రామ్మూర్తి, కార్యదర్శి ఎం.బద్రీనాథ్ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

యర్రగుంట్ల మండలం పి. వెంకటాపురం గ్రామంలో నివసిస్తున్న దుర్గం దస్తగిరి 14-7-2025న ప్రొద్దుటూరుకు వస్తుండగా అమ్మవారిశాల రహదారిలో యల్.ఐ.సి. ఆఫీసు దారి అ భూమి యొక్క పట్ట కాగితాలు పోయినవి. ఆ డాక్యుమెంటు సర్వే నంబర్లు 486/1985, 327/1988 మాలేపాడు గ్రామంలో తనకున్న భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన ఎడల నాకు ఇవ్వవల సినదిగా కోరుతున్నాను. నా ఫోన్ నెం: 9885059604.